ప్రజాశక్తి

మంగళవారం 14 అక్టోబర్ 2025

5

పార్వతీపురం మన్యం

సిఆర్‌టిలను కొనసాగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

డిఎస్‌సి ద్వారా నియామకమైన ఉపాధ్యాయులు విధుల్లో చేరుతున్నందున పాఠశాలల్లో పని చేస్తున్న సిఆర్‌టిలను కూడా కొనసాగించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.భాస్కరరావు మాట్లాడుతూ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు ముందే తమ పోస్టులను డిఎస్సీ నుంచి మినహాయించాలని కోరుతూ సిఆర్టీలు ఆందోళన చేపట్టారని చెప్పారు. సిఆర్‌టిల ఉద్యోగాలకు ముప్పు వుండదని అధికారులు, మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకం పూర్తయిన తర్వాత సిఆర్టీల భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉందన్నారు. వారి ఉద్యోగాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

పిహెచ్‌సిలకు వైద్యులు... ఏరియా ఆసుపత్రికి తిప్పలు

వైద్యాధికారుల కొరతతో రోగులకు అవస్థలు

ప్రజాశక్తి -పాలకొండ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గల వైద్యులు సమ్మెలో ఉండడంతో డివిజన్ కేంద్రంలో గల ఏరియా ఆసుపత్రి నుంచి ముగ్గురు వైద్యులను ప్రాథమిక ఆరోగ్యంద్రాలకు పంపించారు. మండలంలోని అన్నవరం, ఎంసిపురం పిహెచ్‌సిలతో పాటు సీతంపేట పిహెచ్‌సికి నియమించారు. దీంతో ఏరియా ఆసుపత్రిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏజెన్సీకి ముఖ ద్వారంగా ఉన్న ఈ ఆస్పత్రిలో రోగుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. రోజుకు ఓపి 400కు పైగా నమోదు కాగా, ఇన్‌పేషెంట్లు 50 మంది వరకు ఉంటున్నారు. పాలకొండతో పాటు సీతంపేట, భామిని, వీరఘట్టం, విజయనగరం జిల్లా రేగిడి మండలం నుంచి శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం నుంచి కూడా అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. అసలే వర్షాలు కురవడంతో జ్వరాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ముగ్గురు జనరల్ ఫిజీషియన్లు పిహెచ్‌సిలకు వెళ్లిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించడానికి కూడా వైద్యుల కొరత కనిపిస్తుంది. దీంతో ఆసుపత్రిలో ఉన్న వైద్యులు పనిఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పిహెచ్‌సి వైద్యుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యుల కొరత ఇబ్బందిగానే ఉంది

ఆస్పత్రిలో వైద్యుల కొరత వల్ల ఇబ్బందిగానే ఉంది. పిహెచ్‌సిలకు వైద్యులను డిప్యూటేషన్ వేయడంతో ఒపితో పాటు ఇతర విభాగాల్లో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కె.చిరంజీవి,
సూపరింటెండెంట్

వైద్యాధికారులకు మద్దతుగా నల్ల బ్యాడ్జీలతో విధులకు..

కురుపాం : పిహెచ్‌సి వైద్యాధికారులు సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేస్తున్న నేపథ్యంలో రావాడ రాంభద్రపురం పిహెచ్‌సి వైద్య అధికారులు డాక్టర్ సుస్మిత, దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా వైద్యాధికారుల హక్కుల కోసం ధర్నా చేపడుతున్న నేపథ్యంలో వారు హక్కులు సాధనలో తాము కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశంతో నల్ల బ్యాడ్జీలు ధరించి మద్దతు తెలుపుతూ విధుల్లో పాల్గొన్నామని అన్నారు.

వీరఘట్టం: పిహెచ్‌సిల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు తమ హక్కుల కోసం విజయవాడ ధర్నా చౌక్ లో చేస్తున్న న్యాయపోరాటానికి మద్దతుగా స్థానిక పారా మెడికల్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి తమ మద్దతును వైద్యాధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

వీరఘట్టంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారమివ్వాలి

- చికిత్స పొందుతున్న వారికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేయాలి
- ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతూ అనారోగ్యం బారినపడి మృతి చెందిన విద్యార్థులు అంజలి, కల్పన కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షలు నష్టపరిహారం ఇచ్చి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్, సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక రావాడ జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందనడానికి ప్రత్యక్ష సాక్ష్యమే కురుపాం గురుకుల పాఠశాలలో ఈ దుస్థితని విమర్శించారు. గిరిజన విద్యాలయాల్లో మౌలిక వసతులైన మంచినీరు, దోమతెరలు, ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని, గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మరణానికి, 170 మంది విద్యార్థుల అస్వస్థతకు కేవలం పారిశుధ్య లోపం, కలుసిత తాగునీరే కారణమని ప్రజాసంఘాల పరిశీలనలో నిర్ధారణ అయిందని అన్నారు. ఇంతటి నిర్లక్ష్యానికి కారణమైన గిరిజన సంక్షేమ శాఖ అధికారులపై నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, చిరు ఉద్యోగులపై వేటు వేసి ప్రభుత్వం తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మరణించిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు ఈరోజు వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా రూ.50 లక్షలు చొప్పున మరణించిన విద్యార్థుల కుటుంబాలకు చెల్లించాలని, అనారోగ్యంతో వైద్యం చేయించుకుంటున్న వారి కుటుంబాలకు రూ.50 వేలు చొప్పున ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యత కలిగిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గాని, కురుపాం ఎమ్మెల్యే గాని ఆదిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోగా గత పాలకుల వైఫల్యం పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయడం సరికాదని అన్నారు. జిల్లాలోని అన్ని గిరిజన విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు తక్షణమే నిధులు విడుదల చేయాలని, నీటి కలుషితం కాకుండా తక్షణమే చర్య చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఇప్పటికే అనేక సందర్భాల్లో అధికారులకు తెలియజేసినా ఎలాంటి ప్రయోజనం లేకపోయిందని, ఇప్పటికైనా ఈ సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని, లేనిచో ఎస్ఎఫ్ఐ, ఆదివాసీ గిరిజన సంఘం, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం హెచ్‌డిటి సురేష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె. సీతారాం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.అనిల్, కె.అఖిల్, సహాయ కార్యదర్శి బి. గంగారావు, సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎన్‌వై నాయుడు, బివి రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కురుపాంలో ర్యాలీ చేస్తున్న గిరిజనసంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు

హెచ్‌డిటికి వినతిని అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

మొక్కజొన్న కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి కోరారు. సోమవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ఉండగా రైతులు రూ.1900 నుంచి రూ.2వేలుకు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. మొక్కజొన్న కోతకు సిద్ధమయిందని, కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కృష్ణమూర్తి ఆ ప్రకటనలో కోరారు.

కమిషనర్‌ను కలిసిన వైసిపి గిరిజన ప్రజాప్రతినిధులు

విద్యార్థుల మరణాలపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు తోయక అంజలి, తోయక కల్పన మరణం 140 మందికి ఏకకాలంలో హెపటైటిస్ ఎ వ్యాప్తి, ఏకలవ్య పాఠశాలలో 30మందికి సోకిన ఘటనపై జాతీయ మానవహక్కుల సంఘానికి ఢిల్లీలో సోమవారం వైసిపి ఫిర్యాదు చేసింది. అరకు ఎంపి గుమ్మ తనూజా రాణి, తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి ఆధ్వర్యంలో మాజీ ఉపముఖ్యమంత్రిలు పాముల పుష్పశ్రీవాణి, పీడిక రాజన్న దొర, మాజీ ఎంపి మాధవి, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, వైసిపి మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ జిసిసి చైర్మన్ డాక్టర్ శోభా స్వాతి రాణి కలిసి జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్మన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వందలాది మంది ఆసుపత్రిలో మంచానపడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమగ్రమైన ధర్యాప్తు నిర్వహించి విద్యార్థులకు నష్టపరిహారం, రాష్ట్ర ప్రభుత్వం వైద్య నిర్లక్ష్యం వల్ల జరిగిన నష్టానికి రాష్ట్ర ప్రభుత్వంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సత్వరమే సమస్యలు పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందిన సమస్యలు సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన అర్జీదారులు తమ సమస్యల పరిష్కారంతో సంతోషంగా ఇంటికి వెళ్లాలని అన్నారు. రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేకంగా క్లినిక్ ప్రారంభించిన సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు. అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యధోరణి పనికిరాదని అధికారులకు స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని 112 మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సంక్షేమానికి అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, గృహాల మంజూరు, పింఛన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూవివాదాలు తదితర సమస్యలకు పరిష్కారాన్ని కోరుతూ కలెక్టరుకు తమ అర్జీలను అందించారు. ఇందులో సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నల్ జగన్నాథ, డిఆర్ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి భాగస్వామ్యమై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

లబ్ధిదారునికి టచ్ ఫోన్ పంపిణీ

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీతానగరం మండలం చిన భోగిలికి చెందిన చుక్కా గణేష్ వికలాంగుడైన తనకు టచ్ ఫోన్ మంజూరు చేయాలని కోరారు. తక్షణమే కలెక్టర్ స్పందిస్తూ జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ప్రతినిధిని ఆదేశిస్తూ టచ్ ఫోన్ అర్జీదారునికి కలెక్టర్ పంపిణీ చేశారు. అర్జీ ఇచ్చిన వెంటనే తన సమస్య తీరడం పట్ల అర్జీదారుడు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 24 వినతులు

సీతంపేట: ప్రతి సోమవారం స్థానిక ఐటిడిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎపిఒ జి.చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 24 మంది గిరిజన ప్రజలు హాజరై తమ వ్యక్తిగత సమస్యలపై వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడి ఇఇ రమాదేవి, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, పిహెచ్ఒ వెంకట గణేష్, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానందం, పిఆర్ డిఇ, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి : యుటిఎఫ్

పార్వతీపురం: కురుపాం గురుకుల పాఠశాలలో చదువుతూ మృతి చెందిన ఇద్దరు విద్యార్థినుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి కోరారు. సోమవారం ఆమె యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావుతో కలిసి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల్లేన్నారు. కురుపాం గురుకుల పాఠశాలలో సరైన తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు లేవన్నారు. బాలికలు చదువుకునే గదిలోనే భోజనం చేయడం, పడుకోవడం దారుణమని అన్నారు. ఇద్దరు బాలికలు పచ్చకామెర్లతో మృతి చెందడం తో పాటు 170మంది ఆసుపత్రి పాలయ్యారని చెప్పారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని విజయగౌరి కోరారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉచితంగా కేన్సర్ వైద్య పరీక్షలు : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో ఈనెల 15న సీతంపేట ఏరియా ఆసుపత్రిలో జెమ్స్ ఆసుపత్రిలోని ప్రముఖ వైద్యుల ద్వారా ఉచిత కేన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరం ద్వారా కేన్సర్ వ్యాధి నిర్ధారణకు అవసరమయ్యే మోమోగ్రఫి, అల్ట్రా సౌండ్, పాప్ స్మియర్ టెస్ట్, చెస్ట్ ఎక్సరే వంటి పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ ఆంకాలజిస్ట్ వైద్యులు ఈ వైద్య శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని ఐటిడిఎ పరిధిలోని ప్రజలంతా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా పిఒ తెలిపారు.

నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ నాయకులు

మినీ అంగన్వాడీలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పదోతరగతి పాసైన మినీ అంగన్వాడీలకు మెయిన్ అంగన్వాడీ కార్యకర్తలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరుతూ సోమవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు అమరేశ్వరి, ప్రధాన కార్యదర్శి జ్యోతిలక్ష్మి, గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి అద్వర్యాన మినీ అంగన్వాడీ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డికు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో అన్ని ప్రాజెక్టుల పరిధిలో పదోతరగతి పాసైన మినీ అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారని, కానీ కొంతమందికే పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. అందరికీ పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.

నకిలీ మద్యంపై సిబిఐ విచారణ చేపట్టాలి

దోషులను శిక్షించాలి : మాజీ ఎమ్మెల్యే అలజంగి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నకిలీ మద్యంపై తక్షణమే ప్రభుత్వం సిబిఐ విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు డిమాండ్ చేశారు. నకిలీ మద్యంపై నియోజకవర్గ పరిధిలో గల మహిళలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక ఆర్టీసీ కూడలి వద్ద గల వైఎస్ విగ్రహం వద్ద నుంచి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలిపారు. తక్షణమే నియోజక వర్గం వ్యాప్తంగా గల కల్తీ మద్యాన్ని నివారించాలని, బెల్ట్ షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నకిలీ మద్యం ఏదో, ఎక్కడో ఒకచోట జరుగుతున్నా బయటపడలేదని, దీన్ని పక్కాగా వ్యవస్థీకృతంగా మాఫియా నడుపుతోందని విమర్శించారు. ఆ మాఫియాలో ఉన్న వారంతా టిడిపి నాయకు లేనని ఆరోపించారు. ములకల చెరువు ఘటన తర్వాత రాష్ట్రంలో ఒక్కటంటే ఒక్క వైన్‌షాప్‌పై ఎక్సైజ్ అధికారులు దాడి చేయలేదు సరికదా బెల్టుషాప్‌ల్లో కనీసం తనిఖీ కూడా చేయలేదంటే ఏ స్థాయిలో ఈ నకిలీ మద్యం మాఫియా నడుపుతున్నారో స్పష్టమైందని అన్నారు. గత ప్రభుత్వం మద్యం విధానాలన్నింటినీ రద్దు చేసి, మద్యం షాపులన్నింటినీ తన మాఫియాకు చంద్రబాబు నాయుడు అప్పగించారని, చివరకు బెల్టు షాపులను కూడా మద్యం మాఫియా చేతుల్లో పెట్టారని ఆరోపించారు. ఇప్పుడు ఈ నకిలీ మద్యం దందా ఆధారాలతో సహా బట్టబయలు కావడంతో, ప్రజల ముందు దోషిగా నిలబడిన చంద్ర బాబు, కేసు డైవర్షన్ కోసం సిట్ డ్రామాకు తెర లేపారు. ఈ దందాలో ఆయనకు ఏ మాత్రం ప్రమేయం లేకపోయినా కేసుపై కొంతైనా చిత్తశుద్ధి ఉంటే, వైసిపి డిమాండ్ చేస్తున్నట్లు, నకిలీ మద్యంపై సిట్‌తో కాకుండా, సిబిఐతో దర్యాప్తు చేయించాలని, అలా తన నిర్దోషిత్వాన్ని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు నిజాలు వెలికి తీస్తున్న మీడియాపై చంద్రబాబు కక్షసాధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు, ప్రధాన కార్యదర్శి పోలా సత్యనారాయణ, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు పోరాన శ్రీరామచంద్ర నాయుడు, ఎంపిపి గుడివాడ నాగమణి, జెడ్‌పిటిసిలు మామిడి బాబ్జీ, అలజింగి రవి కుమార్, బలగ నాగేశ్వరరావు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గులిపల్లి సునీత, జిల్లా, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర అనుబంధ విభాగాల ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



పార్వతీపురం పట్టణంలో ర్యాలీ చేస్తున్న అలజంగి జోగారావు, వైసిపి నాయకులు

జలపాతాల ఖిల్లాగా పార్వతీపురం

డోలీ మోతలు లేని గ్రామాలే ఉండాలి

ఫిర్యాదుదారు సంతృప్తి చెందేలా మాట్లాడాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జలపాతాల ఖిల్లాగా పార్వతీపురంను మార్చాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. మీ మండల పరిధిలో పర్యాటక ప్రాంతాలను గుర్తించాలని, వాటికి సంబంధించిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పర్యాటకుల కోసం ప్రతి చిన్న జలపాతాల్ని గుర్తించి, అందరికీ అందుబాటులోకి తీసుకురావాలన్నారు పేర్కొన్నారు. జిల్లాను జలపాతాల ఖిల్లాగా మారాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డోలి మోతలు లేని గ్రామాలే ఉండాలని, అందుకు అవసరమైన అంచనాలను రూపొందించాలని అన్నారు. ప్రతీ గ్రామానికి అంబులెన్స్ వెళ్లేలా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులన్నీ సకాలంలో పరిష్కారం కావాలని, అర్జీదారుడు సంతృప్తి చెందాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అర్జీ రీ ఓపెన్ కారాదని, ఫిర్యాదు నమోదు సమయంలో అధికారి భాష, సంభాషణా శైలి సక్రమంగా, మర్యాదగా ఉండాలని సూచించారు. కౌశలం సర్వే వేగవంతం చేయాలని, తరచూ విసి, టిసి లు నిర్వహించడంతో పాటు వారానికి ఒకసారి ఫిజికల్ మీటింగ్ నిర్వహించి, మంచి పనితనం కనబరచాలని అన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి, డిఆర్ఒ కె.హేమలత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో నకిలీ మద్యం లేదు

ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లాలో ఎక్కడా నకిలీ మద్యం లేదని ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంతోష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'మన్యం జిల్లాలో నకిలీ మద్యం' అన్న వార్తకు ఆయన స్పందించారు. జిల్లాలో ఉన్న 56 మద్యం షాపులు, 6 బార్లను పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించామని, మద్యం నిల్వలను పరిశీలించామని చెప్పారు. ఎప్పటికప్పుడు మద్యం నమూనాలను సేకరించి రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖలో గల ఎక్సైజ్ రీజినల్ లేబొరేటరీకి పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి ఇంతవరకు 489 నమూనాలను సేకరించి నివేదికలను తెప్పించామని చెప్పారు. ఎక్కడా కల్తీ మద్యం లేదని తేలిందన్నారు. రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సరఫరా చేసిన మద్యం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి వుందన్నారు. జిల్లాలో బెల్ట్ షాపులు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇంతవరకు 15 బెల్ట్ షాపుల పై కేసులు నమోదు చేశామని, 27.4లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నామని ఆ ప్రకటనలో వివరించారు.

మద్యంను తనిఖీ చేస్తున్న అధికారులు

గురుకులాన్ని సందర్శించిన ప్రత్యేక బృందం

కురుపాం :డిఎంహెచ్ఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ, డిడితో తదితర ఎనిమిది మంది సభ్యులతో కూడిన ప్రత్యేక బృందం స్థానిక గురుకుల పాఠశాలను సోమవారం రాత్రి సందర్శించి పరిసర ప్రాంతాలను క్షుణంగా పరిశీలించింది..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అనారోగ్యానికి గురైన నేపథ్యంలో పాఠశాలకు కలెక్టర్ సెలవులు ఇచ్చిన సందర్భంగా మళ్లీ పాఠశాల ప్రారంభానికి ఉన్న వసతులను పరిశీలించి నివేదికను కలెక్టర్ కు అందజేస్తామని తెలిపారు.

కొటియా యువకుడు హిందీ పండిట్

సాలూరు: వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒకటైన పగుల చెన్నూరుకు చెందిన వెలగాడ అనిల్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎస్సీలో హిందీ పండిట్ గా ఎంపికయ్యాడు. మారుమూల గిరి శిఖర గ్రామానికి చెందిన అనిల్ తల్లిదండ్రులు నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన వారు. మండలంలోని తోణాం,నంద సంతల్లో ఫ్యాన్సీ వస్తువులు అమ్ముకుంటూ తల్లిదండ్రులు అనిల్‌ను చదివించారు. సాలూరులోని ఆర్‌సిఎం స్కూల్లో పదోతరగతి పూర్తి చేసిన అనిల్ పి.కోనవలస గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశారు. ఆ తర్వాత పణుకువలస డైట్ కళాశాలలో డైట్ పూర్తి చేశారు. తర్వాత హిందీ పండిట్ కోర్సు కూడా పూర్తి చేశారు.

రైతులకు పరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో తుపానుకు నష్టపోయిన అన్ని రకాల పంటలకు అధికారులు గుర్తించి నష్టపోయిన పంటలకు పూర్తిస్థాయిలో వెంటనే పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని దేవకోన పంచాయతీ అంటిపేటలో కుళ్లిపోయిన పత్తి పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పది రోజుల క్రితం తుపాను వల్ల చేతికొచ్చిన పంటలు నేలపాలవ్వడంతో రైతులు లబోదిబోమనే పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి సందర్భంలో అధికారులు ఇప్పటికే నష్టపోయిన పంటలను పరిశీలించారని తెలిపారు. కావున వెంటనే పరిశీలించిన మొక్కజొన్న, పత్తి, వరి, బొప్పాయి, తదితర పంటలకు నష్టపరిహారం ఇచ్చి అన్ని విధాలా తక్షణమే ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంటలు పోయిన రైతులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు షోకాజ్

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని కడకెల్ల మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.నాగరాజుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షోకాజు నోటీస్ జారీ చేసినట్లు ఎంఇఒ-1 డి.గౌర్నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న ఉదయం బయోమెట్రిక్ వేసి మండల స్థాయి అధికారుల అనుమతులు తీసుకోకుండా పాఠశాలల్లో విద్యార్థులను విడిచి వెళ్లిపోవడంతో విధులకు ఆటంకపరిచినందుకు షోకాజు నోటీసు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ, దుమ్మంగి, లక్కగూడ, బంటేసు తదితర పంచాయతీల్లో ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రైస్ కార్డులను కూటమి నాయకులు సోమవారం పంపిణీ చేశారు. క్యూఆర్ కోడ్ ద్వారా ఏ దుకాణంలోనైనా సరుకులు తీసుకువచ్చిన గుర్తింపు కార్డుగా కూడా ఉపయోగించుకోవచ్చునని గిరిజనులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ అడ్డాకుల నరేష్, ఎపి ఎస్టి కమిషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు, దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, నియోజకవర్గ ఎస్సెల్ కన్వీనర్ మండంగి భూషణరావు, వార్డు మెంబర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం, కాశాయిపేట, గెడ్డలుప్పిలో కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్మార్ట్ రైస్ కార్డులను టిడిపి నాయకులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం సర్పంచ్ బి.సత్యవతి, జోను శ్రీనివాసరావు ఎంపిటిసి సభ్యులు బి.పార్వతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్డులు విధానాన్ని తీసుకొచ్చిందని, లబ్ధిదారులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ఉండేందుకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎ.అప్పలనాయుడు, ఎ.సూర్యనారాయణ, గెడ్డలుప్పి టిడిపి నాయకులు కర్రి శంకర్రావు, సొంగల సింహాచలం, కాశీపేట టిడిపి నాయకులు తెలు చంద్రశేఖర్, తిరుపతిరావు, బి.వెంకటప్పు నాయుడుతో పాటు నాయకులు, పాల్గొన్నారు.

15న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 15న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎల్. శ్రీనివాసరావు తెలిపారు. ఎంపిపి కె.దీనమయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని 27 పంచాయతీల్లో గల సర్పంచులు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

రైతుసంఘం మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఈనెల 16న పాలకొండలో జరిగే జిల్లా మూడో మహాసభను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు కోరారు. మండలంలోని లక్ష్మీపురం, బూర్జ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతుందని, నిరంతరం రైతాంగ పక్షాన నిలబడి ఉద్యమాలు నిర్వహిస్తుందని, గత మూడేళ్లలో అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు ఉద్యమాలను తీసుకుంటుందని, ఈ మహాసభలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుజ్జురు సింహాచలం, శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు రెడ్డి వేణు, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఇప్పలవలస, లక్ష్మీపురంలో గ్రామసభలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఇప్పలవలస, లక్ష్మీపురంలో ఉపాధి హామీ చట్టం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సామాజిక బృందం తనిఖీలు నిర్వహించి ఆ గ్రామాల్లో గ్రామసభలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పలవలస మాజీ సర్పంచ్ వి సూర్యనారాయణ, ఎంపిటిసి సంతోష్ కుమార్, గ్రామ పెద్దల సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందానికి 209 మంది జాబ్‌కార్డు లబ్ధిదారులు వారానికి వంద రూపాయలు చొప్పున టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ అంచనాలకు 1వారి ఫిర్యాదులు పేర్కొన్నారు. ఈ డబ్బులు మేట్ల ద్వారా వసూలు చేసి ఇవ్వడం జరిగిందని ఫిర్యాదులు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్రావుకు తెలిసినప్పటికీ నేరుగా టెక్నికల్ అసిస్టెంట్‌కే డబ్బులు ఇచ్చినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పి రామచంద్రరావు, డిఆర్‌పి ఎం.నరేష్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై దాడి అమానుషం

ప్రజాశక్తి - పాలకొండ

శ్రీకాకుళం జిల్లా కొత్తూరు తహశీల్దార్ బాలకృష్ణపై ఒక మహిళ దౌర్జన్యం చేయడం అమానుషమని ఎపి ఎన్జీఓ డివిజన్ గౌరవాధ్యక్షులు లిల్లీ పుష్పనాథం, డివిజన్ అధ్యక్షులు కార్యదర్శి రంగారావ్, ఫైల ఈశ్వరరావు అన్నారు. బాధ్యతగా పనిచేస్తున్న ఉద్యోగిపై ప్రభుత్వ కార్యాలయంలో దౌర్జన్యానికి దిగడం అన్యాయమన్నారు. దాడి చేసిన మహిళతో పాటు దాడికి దిగేందుకు సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళ దాడి చేసి తప్పుడు ఆరోపణలు చేయడం కూడా సరికాదన్నారు. ఉద్యోగులపై ఇలాంటి దాడులు చేస్తే ఊరుకునేది లేదని ఆందోళనలు సిద్ధపడతామని అన్నారు.

గ్రామాల్లో వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో 3వ రోజున ముమ్మరంగా చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం చినభోగిలి, లచ్చయ్యపేట గ్రామాలలో పర్యటించి ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు సమక్షంలో రచ్చబండ కార్యక్రమం ద్వారా గ్రామాల ప్రజల మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు కిషోర్, బలగ శ్రీరాములు, కురమాన శ్రీను పాల్గొన్నారు.

సంతలో 'సంకల్పం'

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రంలో సీతంపేట సంత మార్కెట్ వద్ద సీతంపేట ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో సోమవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. మహిళలకు భద్రత గురించి తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల గురించి వివరించి యువకులు మితిమీరిన వేగంతో ప్రయాణించకూడదన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కొండలపై నుంచి దిగినప్పుడు ఇంజన్ సెల్ ఆపకూడదని అన్నారు. పరిమితి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ఓవర్ లోడ్ వేయరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

జీవ ఎరువుల వాడకంతోనే పంటకు శక్తి

ప్రజాశక్తి - కురుపాం

జీవ ఎరువుల వాడకంతోనే పంట శక్తి, భూమి ఆరోగ్యంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఎస్ ధ్రువ అన్నారు. సోమవారం జియ్యమ్మవలస మండలంలో గల పందులవానివలసలో బయోఫెర్టిలైజర్స్‌పై అవగాహన వారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు బయోఫెర్టిలైజర్స్ ఉపయోగాల గురించి వివరిస్తూ, వాణిజ్య రసాయన ఎరువులపై ఆధారపడకుండా పంటల పోషణకు తీర్చే జీవన ఎరువుల వాడకం ఎలా ఉందో వివరించారు. ప్రత్యేకంగా రిజోబియం, అజోటోబాక్టర్, ఫాస్ఫో బాక్టీరియా వంటి సూక్ష్మజీవుల వాడకం వల్ల పంటలకు లభించే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

దళితులు సాగు చేస్తున్న భూములకు సర్వేలు చేసి ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు ఇచ్చిన కరాసవలస విఆర్ఒ, సర్వేయర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి దళితులు సాగు చేస్తున్న భూములను సర్వేలు చేసి పట్టాలివ్వాలని, మండలంలో పేదలు, గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాసువలస దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని అనేకసార్లు అధికారులకు తెలిపామన్నారు. గతంలో కలెక్టర్ కు ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేయగా సమగ్ర విచారణ చేయాల్సిన విఆర్ఒ చేయకుండా తప్పుడు నివేదిక జిల్లా కలెక్టర్‌కు ఇచ్చారన్నారు. సాగుదారులకు న్యాయం చేయకుండా తప్పుడు నివేదిక ఇచ్చిన విఆర్ఒ, సర్వేయరుపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మండలంలో గతంలో డీకేట్, అటవీ పట్టాలిస్తామని సర్వేలు చేశారు కానీ నేటికీ పట్టాలు పంపిణీ చేయలేదని, ఇప్పటికైనా పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సారిక, జిల్లేడువలస డొంకల వెలగవలస గ్రామాల రెవెన్యూ పరిధిలో అన్‌సర్వేడ్ భూములున్నాయిని, దళితులు, గిరిజనులు తరతరాలుగా సాగు చేస్తున్నా నేటికీ ఎటువంటి హక్కులు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందకుండా పోతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కావున ఇప్పటికైనా పట్టాల పంపిణీ చేయాలని కోరారు. జిల్లేడువలస గిరిజనులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి, సింహాచలం, బొంగ కృష్ణ, బర్ల అప్పారావు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎపి వ్యవసాయ కార్మికసంఘం ధర్నా

అధికారులకు సమస్యను వివరిస్తున్న శ్రీనివాసరావు

పిహెచ్‌సికి వెళ్లాలంటే నరకమే

ప్రజాశక్తి- పాచిపెంట

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే ముడుకు నీటిలో వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, ప్రజలు నరక యాతన పడుతున్నారని స్థానిక ప్రజలు, మహిళలు పార్వతమ్మ, రేవతమ్మతోపాటు మహిళా సంఘం నాయకులు త్యాడ ప్రభావతి, కెవిపిఎస్ నాయకులు కొరటాల అప్పలస్వామి, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ స్థానిక పిహెచ్‌సికి వెళ్లే రోడ్డు వర్షం పడితే చెరువును తలపిస్తుందని ఫలితంగా ప్రయాణం నరకంగా ఉందని చెప్పారు. 108 వాహనం, ఆటోలు వంటివి కూడా ఈ ఆసుపత్రికి వెళ్లాలన్నా నడవలేని పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా ఉపయోగం లేదని ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజల పైన కరుణించి వర్షంపు నీరు రోడ్డుపై నిల్వ లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి పట్ల పాలకులు అధికారులు నిర్లక్ష్యం మానుకొని వెంటనే స్పందించి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

మురుగు నీటిలో దిగి నిరసన తెలుపుతున్న నాయకులు

హిందీ ప్రచారసభ కన్వీనర్‌గా శివానంద్

ప్రజాశక్తి - పాలకొండ

హిందీ ప్రచారసభ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడే హిందీ కోర్సులైన నాగరిబోద్, ప్రవేశ్, ప్రథమా, మధ్యమా, ఉత్తమ, విశారద్, భూషణ్, విద్వాన్ పరీక్షల్లో విద్యార్థులను సమ్మిళితం చేసి హిందీ శిక్షక్ ప్రశిక్షణ్ కళాశాలను నిర్వహిస్తూ హిందీ భాషను విస్తృతంగా ప్రచారం చేయడమే కాకుండా హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నందుకు చోంగా శివానంద్‌ను హిందీ ప్రచారసభ హైదరాబాద్ కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు హిందీ ప్రచారసభ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నాంపల్లి హైదరాబాద్లో నిర్వహించిన హిందీ దివాస్ కార్యక్రమంలో హిందీ ప్రచారసభ హైదరాబాద్ అధ్యక్షులు ప్రొఫెసర్ చంద్రదేవ్, జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి నియామక పత్రం అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం శివానంద్ మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి కన్వీనర్‌గా నియమించినందుకు హిందీ ప్రచారసభ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నియమాకంతో హిందీ భాషాభివృద్ధికి మరింత ఉత్సాహంతో పనిచేస్తానని తెలిపారు. శివానంద్ నియామకంపై ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారసభ హైదరాబాద్ అధ్యక్షులు చోంగా లక్ష్మనాయుడు, హిందీ ప్రచారసభ హైదరాబాద్ పరీక్ష మంత్రి ప్రొఫెసర్ సురేష్ పురీ, కోశాధికారి గిరిధర్ రావు, సాహిత్య మంత్రి ఆర్.బిచ్చయ్య, హిందీ ప్రచారసభ ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారసభ కన్వీనర్ కోనే శ్రీధర్, హిందీ భాషాభిమానులు హిందీ ఉపాధ్యాయ, అధ్యాపకులు శుభాకాంక్షలు చెప్పి హర్షం వ్యక్తం చేశారు.

శివానంద్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న ప్రతినిధులు

ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శన

ప్రజాశక్తి- బలిజిపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎంఇఒ-1 సామల సింహాచలం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల తరగతి గదులను, సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైనట్లు గుర్తించారు. మరుగుదొడ్లు, తాగు నీరు పరిశీలించారు. అనంతరం కళాశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వృత్తి విద్యా కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులతో మాట్లాడుతూ ఎలక్ట్రికల్ కోర్సుల్లో మంచి ప్రావీణ్యం సంపాదించినట్లయితే ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చక్కగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మాధవి, అధ్యాపకులు గోపి, సీతం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టెక్ హబ్‌గా విశాఖ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజం గూగుల్ రాకతో విశాఖ టెక్ హబ్‌గా మరనుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అభివృద్ధికి ఇది చారిత్రాత్మక మైలురాయిగా నిలు స్తోందని అన్నారు. పరిశ్రమల ప్రోత్సాహానికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రానికి గ్లోబల్ కంపెనీలను తీసుకు రావడంలో సిఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టి ఫలితమే ఇందుకు నిదర్శనం అన్నారు. హైదరాబాదులో మైక్రోసాఫ్ట్ రాకతో ఐటి రంగం విప్లవాత్మక మార్పు సాధించినట్లే విశాఖలో గూగుల్ రాకతో రాష్ట్రం డిజిటల్ టెక్ రంగానికి కేంద్రంగా మారనుందని అన్నారు. రూ.87 వేల కోట్ల పెట్టుబడితో సౌత్ ఏషియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్ ను గూగుల్ నిర్మించ నుందని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రతిష్టను పెంచి వేలాది మంది యువతకు ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రభుత్వం రూపొందించిన అత్యుత్తమ పాలసీలు, సింగిల్ విండో క్లియరెన్స్, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం వంటి చర్యలు వల్లే గూగుల్, టిసిఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి అడుగుపెడుతున్నాయని తెలిపారు. ఎపిలో యువతకు ఐటి రంగంలో ఐదు లక్షలు ఉద్యో గాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచే స్తుందని అన్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, విశాఖలో ఏఐ, టెక్ హబ్, తిరుపతిలో ఎలక్ట్రానిక్ సబ్, ఇవన్నీ ఎపి అభివృద్ధికి నాంది పలకనున్నాయని ఎమ్మెల్యే చెప్పారు.

భూసర్వే పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

భూ సర్వే పనులను పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర పరిశీలకులు కె.సూర్యారావు అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం భూ సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములు సర్వే చేయడం చేస్తున్నామన్నారు. అనకాపల్లి, కాకినాడ, పార్వతీపురం మన్యం జిల్లాలో ఉండే భూములను తనకు కేటాయించిన జిల్లాల్లో భూ రీసర్వే పనులు ఏ మేరకు జరుగుతున్నాయి ఎంతవరకు అనేది పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మన్యం జిల్లా భూ సర్వే అధికారి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ జిల్లాలో 43 గ్రామాల్లో 27, 380 ఎకరాలు భూమిని గుర్తించి ఇందులో ప్రైవేటు భూమి 18, 788 గుర్తించామని, ఇప్పటి వరకు 5,383 ఎకరాల భూమి సర్వే అయిందని, మిగతా 13, 450 ఎకరాలు సర్వే మరో 33 రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. ఈనెల 3నుంచి ఈ సర్వే ప్రారంభమైందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎల్.శ్రీనివాసరావు, సర్వేయర్ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న సూర్యారావు

సూపర్ జిఎస్‌టిపై అవగాహన అవసరం

ప్రజాశకిత - పార్వతీపురం

సూపర్ జిఎస్‌టిపై అందరికీ అవగాహన అవసరం, అన్నివర్గాలకు ప్రయోజనకరమని కార్మిక శాఖ సహాయ కార్మిక కమిషనర్ పి.సువర్ణ అన్నారు. జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిఎస్‌టి 2.0పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు గిగ్ (తాత్కాలిక పనివారు) ప్లాట్ఫాం వర్కర్లతో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అవగాహన నిర్వహిస్తామన్నారు. జిఎస్టి తగ్గింపు వల్ల సామాన్యులపై భారాలు తగ్గుతాయని, ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు రావడం ద్వారా, ఉపాధి అవకాశాలు పెరిగేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ సహాయ డైరెక్టర్ పి.సీతారాము, ఇన్‌ఛార్జ్ మున్సిపల్ కమిషనర్, జి. శ్రీనివాసరాజు, పలువురు వ్యాపారులు, ప్రజలు ఉన్నారు.

బలిజిపేట: ర్యాలీ చేస్తున్న ఎంపిడిఒ, తదితరులు

బలిజిపేట : స్థానిక ఎంపిడిఒ శ్రీవాణి సూపర్ జిఎస్‌టిపై అందరికీ అవగాహన అవసరమని, అన్ని వర్గాలకు ప్రయోజనకరమన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు అధికారులు, ప్రజలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వినియోగదారులకు ప్రయోజనం కలిగించేలా జిఎస్‌టిని నాలుగు శ్లాబులు నుంచి రెండు శ్లాబ్‌లకు పరిమితం చేసిందన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పుష్పారావు, టైపిస్టు నారాయణరావు, విక్టర్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిఎస్‌టి 2.0పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుశాంత్ జన జిఎస్‌టిపై క్లుప్తంగా విద్యార్థులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం సవరించిన జిఎస్‌టి గురించి పిల్లలకు తెలియజేశారు. డిపార్ట్మెంట్ కామర్స్ బోధకులు సిహెచ్ రమేష్ వాణిజ్య దుకాణాలు స్లాబ్‌లు గురించి వివరించారు. క్విజ్ పోటీలు వ్యాసరచన పోటీలు నిర్వహించి పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలోని ఆర్‌టిసి బస్టాండ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతిరోజూ పరిశీలించాలని ఆర్‌టిసి అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. పారిశుధ్య కార్యక్రమం చేపట్టక ముందు, తర్వాత ఫోటోలు తీయాలని, బస్సు షెల్టర్లను పరిశుభ్రంగా ఉంచాలని, బస్సు స్టాప్‌లు, షెల్టర్లు, స్టాండ్లు అన్ని ఫోటోలు తీయించాలని చెప్పారు. బస్సుల్లో దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అమృత్ పథకం కింద బస్టాండ్లల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. వికలాంగులకు, వృద్ధులకు బస్సు ఎక్కించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లాలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు బాగా జరగాలని ప్రతి ట్యాంక్ అభివృద్ధి, మొక్కలు నాటడం ముఖ్యమని పేర్కొన్నారు. జిల్లా అంతటా పరిశుభ్ర వాతావరణం కనిపించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ శాఖలపై వచ్చిన ప్రతికూల వార్తల పట్ల తక్షణమే స్పందించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లా అధికారులు వారి స్థాయిలో చేపట్టాల్సిన పనులను తక్షణమే చేపట్టాలని సూచించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తరలించుకుపోయినా పట్టించుకోరా?

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని చినబోగిలి - మక్కువ ప్రధాన రహదారికి ఆనుకొని ములక్కాయ వలస రెవెన్యూ పరిధిలో గల రైతు సేవా కేంద్రానికి ఆనుకొని ఉన్న కంకరమెట్టను అక్రమ దారులు గత వారం పది రోజులుగా యథేచ్ఛగా తవ్వి తరలించుకుపోతున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని పూర్తిగా చెల్లించకుండా దొడ్డిదారిన వందలాది మెట్రిక్ టన్నుల గ్రావెల్ తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ రహదారులు కాక ప్రైవేటు వ్యక్తులు, రాజకీయ పలుకుబడులు ఉపయోగించి వారి సొంత అవసరాలకు అక్రమంగా జెసిబిల సహాయంతో తరలించుకుపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇదే అదునుగా జెసిబి, ఇతర వాహనాల యజమానులు కూడా అక్రమ గ్రావెల్ దందాను చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి అక్రమ గ్రావెల్ తవ్వకాలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్‌తో గ్రావెల్‌ను తరలిస్తున్న అక్రమార్కులు

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారు?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2024 ఎన్నికల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆడబిడ్డ నిధి పథకాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారని వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ ప్రశ్నించారు. 19 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు ఉండే ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18000 వారి ఖాతాలో వేస్తామని చెప్పి 15 నెలల గడిచిన మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం నేటికీ నెరవేర్చకుండా మోసగించిందని విమర్శించారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసి మహిళలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పొదుపు సంఘాలకు రూ. 3లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు ఇచ్చి వైసిపి ప్రభుత్వం ఆదుకుంటే ఇప్పటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏకంగా సున్నా వడ్డీ రుణాలు రూ.3లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఇస్తానని చెప్పిన సిఎం చంద్రబాబు నాయుడు మహిళలను మోసగించారని గోపాల్ ఆరోపించారు.

విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యంలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని, గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు విద్యార్థి, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు, పలు పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన విద్యార్థుల ప్రాణాలకు ఎటువంటి విలువ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో మృతి చెందిన కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు అంజలి,కల్పన తల్లిదండ్రులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే అంజలి తల్లి కి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాలక రంజిత్ కుమార్ (గిరిజన సంక్షేమ సంఘం), బి.రవి కుమార్ (ఏఐఎస్ఎఫ్), కె.సోమేష్ (పిడిఎస్ఒ), పి.సంగం (లిబరేషన్), ఆర్‌విఎస్ కుమార్ (సిపిఐ), వి.దాలినాయుడు (కాంగ్రెస్ పార్టీ), టి.జీవ(రెడ్ స్టార్ పార్టీ), నాయకులు గణేష్, గౌరీ శంకర్ రావు, సూరయ్య, గౌరి, రంజని, రజిని, గౌరమ్మ ,రామయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన

నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

17న ఐటిఐ ఐదో విడత కౌన్సిలింగ్

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ప్రభుత్వ ఐటిఐలో మిగిలిన సీట్లకు ఐదో విడత కౌన్సిలింగ్ ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాలుగవ విడత తర్వాత మిగిలి యున్న సీట్లకు ఐదవ విడతలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆన్‌లైన్‌లో iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 16 మధ్యాహ్నం 2గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు అదే రోజు మధ్యాహ్నం 4గంటల లోపల తమ నమోదు యునిక్ నంబర్, అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో తమ దగ్గరలో గల ఏ ప్రభుత్వ ఐటిఐ నందైనా వెరిఫికేషన్ చేయించుకొని ఆమోదం చేయించుకోవాలన్నారు. అలా చేసిన వారి పేర్లు మాత్రమే మెరిట్ లిస్టులో నమోదు చేస్తామన్నారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే ఐటిఐలో ప్రవేశానికి అర్హులని గమనించాలన్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు 17న ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సీతంపేటలోని ప్రభుత్వ ఐటిఐకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 75690 62449, 9491134464 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బంగారు నగలు చోరీ

ప్రజాశక్తి- పాచిపెంట

విధులు ముగించుకుని ఉపాధ్యాయురాలు పాఠశాల నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా, మార్గ మధ్యలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారు ఆపి బంగారు నగలు చోరీ చేసిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. మండలంలోని సరాయివలసలోని ఏకలవ్య పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మ్యూజికల్ టీచర్ శృతి భజనలాల్ ఢిల్లీ ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో స్టడీ అవర్ ముగించుకుని సాలూరులో నివాసం ఉంటున్న తన ఇంటికి కారులో బయలుదేరారు. మండలంలోని పాంచాలి గ్రామ సమీపంలో ఇద్దరు వ్యక్తులు కారును అటకాయించి ఉపాధ్యాయురాలి మెడలో చైను, ఉంగరాలు కాజేశారు. ఆమె సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ, ఎఎస్ఐ బెల్లాన ముసలయ్య సిబ్బంది సంఘటనా స్థలం సమీపంలో సిసి పుటేజీలను పరిశీలించారు. ఉపాధ్యాయురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. గతేడాది ఇదే ప్రాంతంలో పాంచాలి ఎంపిటిసి ఉమామహేశ్వరిపై కత్తితో దాడి చేసిన సంగతి తెలిసిందే. తరచూ ఇటువంటి సంఘటనలు జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రాంతంలో అవుట్ పోస్ట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం కుదమ పంచాయతీ పరిధిలో పెదకుదమ, చినకుదమ గ్రామాల మధ్య గౌరీపురం కూడలి వద్ద సోమవారం ఉదయం ట్రాక్టర్ ఢీకొనడంతో పెద కుదమకు చెందిన వారాడ నాగభూషణ (46) మృతి చెందారు. దీనిపై చిన మేరంగి ఎస్ఐ పి.అనీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద కుదమ గ్రామానికి చెందిన వారాడ నాగభూషణం వేకువ జామున చినకుదమ వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అతన్ని ఢీకొంది. ఈ సంఘటన చూసిన ప్రత్యక్ష సాక్షులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే వచ్చిన 108 వాహనంపై అతనిని పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఆయనకు భార్య గంగ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు, కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కాగా కుమార్తె సునీతకు పెళ్లి నిశ్చయమై ఆదివారం గోధుమ రాయి కార్యక్రమం జరిగిందని,ఇంతలో ఈ ఇలా జరగడం ఇటు కుటుంబ సభ్యులు, అటు గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

చెత్తను డస్ట్ బిన్‌లో వేయాలి

ప్రజాశక్తి - కురుపాం

పరిసరాలు పరిశుభ్రత పాటిస్తూ ప్రతి ఒక్కరూ చెత్తను డస్ట్ బిన్‌లో వేసుకోవాలని ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. సోమవారం కురుపాంలో వాయుపుత్ర సేవా సంఘం మొదటి వారోత్సవ సందర్భంగా రూ.60 వేలు విలువ చేసే రెండు డస్ట్ బిన్‌లను రావాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు రోడ్డుపై చెత్త వేయకుండా డస్ట్ బిన్ లో వేసి పారిశుధ్య లోపం లేకుండా ఉండేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ ఈ ఓ సురేష్ కుమార్, ఎల్విన్‌పేట ఎస్ఐ శివ ప్రసాద్, కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, వాయుపుత్ర సేవా సంఘ సభ్యులు గెంబలి ప్రదీప్, బరాటం కిరణ్, బోటు స్వాతి, బోటు అనిల్ కుమార్, జగదీష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల్లో నాయకత్వ లక్షణాలు ఉండాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రతి బాలికలో నాయకత్వ లక్షణాలుండాలని ఎంఇఒ -1 డి.గౌర్నాయుడు విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలంతా సమానంగా ఉండాలని, లింగ వివక్షత ఉండకూడదని, సమానత్వం పాటించాలని, బాలికలు ముందుజలో ఉండే రోజునే మహిళా సాధికారిక అవుతారని, బాలికల బేబీ బచావో బేటి పడావో, బాలికల అందరూ చక్కగా చదువుకోవాలని, బాలికలంతా రక్షింపబడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెపి నాగమణి, సిడిపిఒ రంగలక్ష్మి, సూపర్వైజర్లు ఎన్.రాజేశ్వరి, జె.జ్ఞానమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.